

దాహార్తి కోసం వచ్చి..

గునుగల్ అటవీ ప్రాంతంలో నీటి వనరులు లేక జింకలు దాహం తీర్చుకునేందుకు రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి. 8లో▸



ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మహిళల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. 8లో▸



కల్లుగీతకు చేయూత

కల్లుగీత వృత్తికి చేయూత నిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ ఛైర్మన్ రవికుమార్‌గౌడ్ పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ముచ్చటగా మూడోసారి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి
- భాగ్య నగరంపై తనదైన ముద్ర
- సౌమ్యుడిగా, వివాదరహితుడిగా పేరు



సాక్షి, సిటీబ్యూరో/ అంబర్‌పేట: కమలం పార్టీ రాష్ట్ర సారథిగా నగర నేతకు అధినాయకత్వం పట్టం కట్టింది. ఆయన ఈ పదవిని అధిష్టించడం మూడోసారి కావడం గమనార్హం. కేంద్ర మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్‌రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రెండుసార్లు ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన కిషన్‌రెడ్డికి మరోసారి పగ్గాలు అప్పగించడం ద్వారా నగర బీజేపీకి పార్టీ హైకమాండ్ అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో జన్మించిన కిషన్‌రెడ్డి మూడు దఫాలు ఎమ్మెల్యేగా, శాసన సభా పక్ష నేతగా వ్యవహరించారు. దీంతో ఆయనకు నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కేడర్‌తో ప్రత్యేక సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రజా సంఘాలతో సైతం కిషన్‌రెడ్డి తనదైన శైలిలో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. నగర సమస్యలపై పోరాడి వాటిని పరిష్కరించుకునే వారు. నిత్యం అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేసి తిరిగా శాసన సభ వ్యవహారాలు నిర్వహించేవారు.

రాష్ట్రంలో రామరాజ్యం రావాలి



తుక్కుగూడలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: రాష్ట్రంలో రాబందులు రాజ్యం పోయి రామ రాజ్యం రావాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలో ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అవినీతి, కుటుంబ పాలనకు స్వస్తి చెప్పే రోజుల దగ్గరపడ్డాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నిరుపేదల సంక్షేమం, చేపడుతున్న పథకాలను పార్టీ శ్రేణులు ఇంటింటా తెలియజేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరందర్‌గౌడ్, మీడియా కన్వీనర్ వీ.సుధాకర్ శర్మ, మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మణ్, మున్సిపల్ ఛైర్మన్ కె.మధుమోహన్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం డిపోకు ఉత్తమ అవార్డు



సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ అశోక్‌రాజు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర స్థాయిలో తృతీయ ఉత్తమ డిపోగా ఇబ్రహీంపట్నంను ప్రకటించి అవార్డు అందజేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ అశోక్‌రాజు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్రేటర్ పరిధిలోని 25 డిపోల్లో అధిక ఆదాయం తీసుకొస్తున్నందుకుగాను ఇబ్రహీంపట్నం డిపోకు ఈ అవార్డు దక్కింది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత




పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట దిగువన ప్రభుత్వ భూమిలో వెలసిన ఐదు అక్రమ నిర్మాణాలను బాలాపూర్ రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. 223 సర్వే నంబర్‌లో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న బాలాపూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ నారాయణ మంగళవారం పోలీస్ బందోబస్తు నడుమ జేసీబీతో నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లయితే క్రిమినల్ నమోదు చేస్తామని హెచ్చరించారు.



హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హకీంపేట ఎయిర్‌పోర్టులో మంత్రి సబితారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కో సం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఛైర్మన్ గోరిగ మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుతో పాటు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నాటి రజాకార్ల దేశ ముకుల భాగస్వాముల అఘాయిత్యాలను తిప్పి కొట్టిన గొప్ప విప్లవకారుడు కొమురయ్య అని కొనియాడారు. కొమురయ్య అమరత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శివకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగ వెంకటేశ్, ఆదిబట్ల మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కలమ్మ, మాజీ జెడ్పీటీసీ ఐలయ్య పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

జెడ్పీ గరంగరం

వాడివేడిగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

- సమస్యలపై నిలదీసిన సభ్యులు
- నీళ్లు నమిలిన అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'మెజార్టీ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేరు. ఉన్న చోట విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించడం లేదు. అనేక మంది టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో తప్పారు. ఫెయిల్యూర్‌కు కారణమైన ఉపాధ్యాయులపై ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారు' అంటూ పలువురు సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారిని నిలదీశారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్ సహా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ప్రజా సమస్యలపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమలాల్సి వచ్చింది. సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మినహా మిగిలిన వారంతా గైర్హాజరయ్యారు.

ఆ ఉపాధ్యాయులపై చర్యలేవీ..?

నర్సప్పగూడ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో 'జీరో' ఫలితాలు నమోదయ్యాయని నందిగామ జెడ్పీటీసీ ఈటె గణేశ్ లేవనెత్తారు. ఉపాధ్యాయులు సరిగా పాఠ్యాంశాలు బోధించకపోవడం వల్లే విద్యార్థులు పరీక్షల్లో తప్పారని.. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ అధికారులను నిలదీశారు. మంచాల మండలంలో 120 మందికిపైగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారని, చీదేడు, దాద్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించేందుకు ఉపాధ్యాయులు లేరని జెడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బూర్గుల ప్రభుత్వ పాఠశాలకు చెందిన మ్యాథ్స్ ఉపాధ్యాయుడిని మరోచోటికి ఎలా డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తారు అని ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి నిలదీశారు. కొంత మంది ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, తరగతి గదుల్లో సెల్ ఫోన్లలో మాట్లాడుతున్నారని ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ ప్రస్తావించారు. కడ్తాల్ కేజీబీవీకి సొంత భవనం లేదు. అరకొర వసతుల మధ్య అద్దె భవనంలో నిర్వహించాల్సి వస్తోంది. సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు చదువులో వెనుకబడాల్సి వస్తోందని తలకొండపల్లి జెడ్పీటీసీ వెంకటేశ్‌గుప్తా, ఎంపీపీ నీరజ సభ దృష్టికి తెచ్చారు. తలకొండపల్లి బీసీ గురుకుల పాఠశాల మహేశ్వరంలో ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాల్సిందే..

వైద్య ఆరోగ్యశాఖలో పలువురు ఉద్యోగులు డిప్యూటేషన్లపై కొనసాగుతున్నారని సభ్యులు తెలిపారు. జిల్లా సరిహద్దులోని తలకొండపల్లి, ఆమనగల్లు ఆస్పత్రుల్లో పోస్టింగ్ పొంది.. సిటీశివారు ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో డిప్యూటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్నారని, దీంతో ఆయా ప్రాంతాల్లోని పేద రోగులకు వైద్యసేవలు అందకుండా పోతున్నాయని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరు ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూ డుతోంది. కాంపౌండ్‌వాల్ కూడా లేదు. కొత్తగా నిర్మించిన భవనాన్ని అందుబాటులోకి తేకపోవడంతో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆ మండల జెడ్పీటీసీ పేర్కొన్నారు. కందుకూరు పీహెచ్‌సీలో ఒకే ఒక్క స్టాఫ్ నర్సు ఉన్నారని, రాత్రిపూట ఆస్పత్రిలో ఎవరూ ఉండటం లేదని, అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు చికిత్స అందడం లేదని ఆ మండల సభ్యురాలు తెలిపారు. యాచారం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ పని చేస్తున్న కొంతమంది సిబ్బంది ఏళ్లుగా పాతుకుపోయారని, పని చేయకుండా కొత్తగా వచ్చిన వైద్యులపై ఆజమాయిషీ చెలాయిస్తున్నారని, అక్కడి సిబ్బందిని మరో ఆరోగ్య కేంద్రానికి బదిలీచేసి, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. మంచాల ఆస్పత్రిలో బీపీ టాబ్లెట్స్ కొరత ఉందని సభ్యురాలు నిత్య సభ దృష్టికి తెచ్చారు.

గుర్తింపులేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి..

'ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తాం. ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపర్చుతాం. విద్యార్థుల నిష్పత్తి మేరకు సబ్జెక్టు టీచర్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని మంత్రి సబితారెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు లేని చోట విద్యావలంటీర్లను నియమించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ప్రభుత్వం నుంచి కనీస అనుమతులు తీసుకోకుండా మంచాల సహా పలు ప్రాంతాల్లో ప్రైవేటు స్కూళ్లు నడుపుతున్నారని, కనీస అనుభవం లేని డ్రైవర్లతో స్కూలు వ్యానులు నడిపించి, ప్రమాదాలకు కారణమవుతున్నారని సభ్యులు సభ దృష్టికి తేగా, జిల్లా వ్యాప్తంగా తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్లాసు రూముల్లోకి సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని సూచించారు. తలకొండపల్లి ఆరోగ్య కేంద్రం భవనం పునరుద్ధరణకు తన ఫండ్స్ నుంచి నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. కంటి వెలుగులో అద్దాల పంపిణీతో సరిపెడుతున్నారని, సర్జరీ అవసరమైన వారిని విస్మరించడం ఎంత వరకు సమంజసమని పలువురు సభ్యులు సభ దృష్టికి తేగా, సర్జరీ అవసరమైన బాధితుల జాబితాను తమకు అందజేస్తే.. తామే ఆ బాధ్యత తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ ఛైర్‌పర్సన్, అడిషనల్ కలెక్టర్



సమావేశానికి హాజరైన సభ్యులు

పుట్టిన బిడ్డను కడిగేందుకు నీళ్లు లేవు

తలకొండపల్లి ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉండటంతో రోగులు వైద్యసేవల కోసం వచ్చేందుకు భయపడుతున్నారని ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌గుప్తా గళమెత్తారు. వర్షాలు వచ్చినప్పుడు ఆస్పత్రి బిల్డింగ్‌విద్యుత్‌షాక్ వస్తోందని తెలిపారు. ఆస్పత్రిలో పుట్టిన బిడ్డను కడిగేందుకు కూడా నీళ్లు లేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

నయా బాస్.. రోనాల్డ్ రాస్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా డి.రోనాల్డ్‌రాస్ నియమితులయ్యారు. రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న డీఎస్ లోకేశ్‌కుమార్‌ను గతవారమే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అడిషనల్ సీఈఓగా నియమించగా, అందుకనుగుణంగా ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. రోనాల్డ్‌రాస్ గతంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (టౌన్‌ప్లానింగ్)గా, సెంట్రల్ జోన్ (ఖైరతాబాద్)కమిషనర్‌గా పని చేశారు. రోనాల్డ్‌రాస్ 2006 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో శిక్షణ తీసుకున్న ఆయన నర్సాపూర్ సబ్‌కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, డ్వాక్రా డైరెక్టర్‌గా, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టు అడిషనల్ సీఈఓగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆర్థికశాఖతో పాటు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా, గనులు, భూగర్భశాఖ కార్యదర్శిగా కూడా ఉన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం జరుగుతున్న బదిలీల్లో భాగంగానే ఈ బదిలీలు చోటు చేసుకున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులైన రోనాల్డ్‌రాస్ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఆయా జిల్లాల్లో పని చేసినప్పుడు చిన్నారుల చదువు కోసం, విద్యాశాఖ ప్రక్షాళనకు, అవినీతి నిర్మూలనకు కృషి చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి



ఎస్.నారాయణరెడ్డి



భానుప్రసాద్



కె.నవీన్

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయపోల్ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. కందుకూరుకు చెందిన నారాయణరెడ్డి, లంగర్ హౌస్ డిఫెన్స్‌కాలనీకి చెందిన భానుప్రసాద్, హస్తినాపురం ఈస్ట్ కాలనీకి చెందిన నవీన్ ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరు బైక్‌పై రాయపోల్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా దూసుకొచ్చిన మారుతి వాహనం (ఏపీ28 బీఎస్ 0010) వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలొదిరారు. కాగా, భారత్ ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాద్ వెళ్లే దారిలో ఉంటే.. వీరు రాయపోల్ వైపుగా ఎందుకు వచ్చారో తెలియాల్సి వుంది. కారును నడిపిస్తున్న పి.శివను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆసరా అవుతారనుకుంటే..

ఉన్నత చదువులు చదివి కుటుంబాలకు ఆసరాగా నిలబడతారని అనుకుంటే రోడ్డు ప్రమాదం ఆ మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. రాయపోల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ రెండో సంవత్సరం చదవుతున్న ముగ్గురు విద్యార్థులు మృత్యువాతపడటంతో కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చింది. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాలను వారి కుటుంబసభ్యులను అప్పగించనున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

నకిలీ పత్రాల ముఠా గుట్టు రట్టు

ఇబ్రహీంపట్నం రూరల్: వాహనాలకు సంబంధించి నకిలీ టాక్స్ పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలు సృష్టిస్తున్న ముఠా సభ్యులను ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, ఆదిబట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మన్నెగూడ ఆర్టీఓ కార్యాలయం వద్ద మీడియేటర్లుగా పని చేస్తున్న కొందరు తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ఆర్టీఓ సాఫ్ట్‌వేర్‌ను మాన్‌ప్లేట్ చేస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రెండురోజుల క్రితం ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. రోడ్డు టాక్స్‌లు వేలల్లో ఉంటే వందల్లో రిసిప్టులు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు రుజువైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ రాకెట్ బట్టబయలు కావడంతో మన్నెగూడ నుంచే తతంగం నడుపుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సిరిసిల్లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పనులకు పూనుకున్నారు. ఉప్పల్, భువనగిరి, నాగోల్, తుర్కయంజాల్ లాంటి ప్రాంతాల్లో ఇలాంటి పనుల వందల్లో చేశారు. ఓ సీఐ బావమరిదికి కూడా టాక్స్ తగ్గించి రిసిప్ట్ ఇచ్చారు. గతంలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఇదే వ్యవహారమై కేసులు పెట్టుకొని రాజీపడ్డట్లు తెలిసింది. నకిలీ ఇన్సూరెన్స్‌లు సృష్టించడం, టాక్స్ చెల్లించే సాఫ్ట్‌వేర్‌ను మార్చడంలో సిద్ధహస్తులైన వారిని ప్రస్తుతం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే మొత్తం ఆరుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు, నకిలీ చలాన్లు, ఇన్సూరెన్స్ పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మోత లేకుండా..

- ప్రతి నాలుగో శనివారం బ్యాగ్‌లెస్ డే అమలు
- ప్రభుత్వ పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ
- విద్యార్థులకు తప్పనున్న బ్యాగుల భారం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్యాగుల భారం తప్పనుంది. నిత్యం పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు అన్ని రంగాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని విద్యాశాఖ తీసుకొచ్చింది. పుస్తకాల మోత, బ్యాగుల భారం లేకుండా బడులకు వెళ్లడానికి బ్యాగ్‌లెస్ డేను ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో బ్యాగ్‌లెస్‌డేను అమలులోకి తీసుకొచ్చింది. గత నెల 23న మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి నెలలో వచ్చే నాలుగో శనివారం రోజును బ్యాగ్‌లెస్ డేగా ప్రకటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులు తప్పకుండా ఈ నిబంధనలు పాటించాల్సిందేనని ఇప్పటికే విద్యాశాఖ డీఈఓలు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గత నెల ఆఖరి వారం నుంచి బ్యాగ్‌లెస్ డేను అమలు చేస్తున్నారు. జిల్లాలోని 1,338 ఆయా పాఠశాలల్లో 1,59,332 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

బ్యాగ్‌లెస్ డే రోజు చేయాల్సింది..

బ్యాగ్‌లెస్ డే రోజున విద్యార్థులకు ఇండోర్, అవుట్ డోర్ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పించాలి. క్విజ్, డూడ్లింగ్ ప్రయోగాలు, చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాల సందర్శనలు, స్థానిక కళాకారులతో పరస్పర చర్చలు, ఉన్నత విద్యా సంస్థల సందర్శనలు చేయించాలి. ప్రతి పాఠశాల తప్పనిసరిగా వివిధ రకాల పనులు కలిగి ఉండే వార్షిక కార్య ప్రణాళికను అభివృద్ధి చేయాలి. ఉపాధ్యాయులందరితో కూడిన కార్యకలాపాలు ముందుగానే ప్లాన్ చేసుకోవడం బాధ్యతలను స్పష్టంగా గుర్తించడం అవసరం.



కేసీఆర్ ముఠాను మట్టి కరిపిస్తాం

- రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఖాయం
- ఆ పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఈటల



ఈటలకు ఘన స్వాగతం పలుకుతున్న అందెల శ్రీరాములు, బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కేసీఆర్ ముఠా (వంద మంది కౌరవులు) బీజేపీ సేనతో (ఐదుగురు పాండవులం) చిత్తుగా ఓడిస్తామని బీజేపీ ఎన్నికల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. పార్టీ నేత అందెల శ్రీరాములు చేపట్టిన పాదయాత్రకు మంగళవారం మల్లాపూర్‌లో ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో పేద దళిత బిడ్డలకు జానెడు జాగా ఇచ్చావా? అని ప్రశ్నించారు. దళితుల భూములను గుంజుకొని ఆ కుటుంబాలను నాశనం చేస్తున్నావ్.. 5,800 ఎకరాలు ఆక్రమించుకున్నావ్.. ఈ విషయమై చర్చకు సిద్ధమని ప్రకటించారు. భర్తలు చనిపోతే భార్యలకు పది రోజుల్లోనే వితంతు పింఛన్ ఇస్తానన్నావ్.. మూడేళ్లయినా ఎందుకు ఇవ్వలేక పోతున్నావని నిలదీశారు. లిక్కర్ మీద రూ.45 వేల కోట్లు ఆదాయం వస్తుంటే పింఛన్లు ఇతర పథకాల పేరుతో 13 వేల కోట్లు పంచి మిగతా మొత్తం దోచుకుంటున్నావని ధ్వజమెత్తారు. సర్వ సంపదకు నిలయం, మిలమిల మెరిసే నిలయమైన హైదరాబాద్‌లో పేదల బతుకులు ఆగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగమొస్తే ఇల్లాలు తాళిబొట్టు తాకట్టు పెట్టి భర్తను, పిల్లలను కాపాడుకునే దుస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ బిడ్డకు దళితుల భూముల మీద కన్నుపడిందని ఆరోపించారు. ఎకరాకు 300 గజాలు ఇస్తామని భయపెట్టి గుంజుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ప్రైవేట్‌లో సైతం ఉచిత విద్య, వైద్యం అందజేస్తామని, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఉద్యోగాలు ఇస్తామని, బెల్టు షాపులను ఎత్తివేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ జాతీయ సభ్యుడు తల్లోజు ఆచారి, పార్టీ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కదారి జంగయ్య పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి



వైద్య శిబిరానికి వచ్చిన మహిళలకు సూచనలు చేస్తున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: మహిళల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చించోడ్ క్లస్టర్‌లో నిర్వహిస్తున్న మహిళల ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య విషయంలో మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సలు అందుతున్నాయని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీసం 60 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి కోసం వచ్చి.. దారి తప్పి..

- రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న జింకలు
- గునుగల్ అటవీ ప్రాంతంలో వందలాదిగా జింకల సంతతి



ఇటీవల గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిన జింక



వన్యప్రాణుల కోసం కుంటలో నీళ్లు నింపుతున్న సిబ్బంది

యాచారం: గునుగల్ అటవీ ప్రాంతంలో జింకల సంతతి గణనీయంగా పెరిగింది. అటవీ ప్రాంతంలో నీటి వనరులు లేక జింకలు దాహం తీర్చుకోవడం కోసం రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి. గునుగల్ అటవీ ప్రాంతం నాగార్జున సాగర్ – హైదరాబాద్ రహదారిపై ఉంది. ఈ రోడ్డుకి ఇరువైపులా దాదాపు 1,500 ఎకరాల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. 2018లో సర్వే చేయగా 350కి పైగా జింకలు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలో వెయ్యికి పైగా జింకలు, వేలాది అడవి పందులు, నక్కలు, హైనాలు ఉన్నాయి. నీటి ఎద్దడి కారణంగా వన్యప్రాణులు సమీపంలోని వ్యవసాయ బావులు, బోరుబావుల వద్దకు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి.

రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురై..

దాహార్తి తీర్చుకోవడం కోసం సాగర్ రోడ్డుపైకి వస్తున్న జింకలు ప్రమాదాలకు గురై మత్యువాత పడుతున్నాయి. గునుగల్ అటవీ ప్రాంతం సాగర్ రోడ్డుపై గునుగల్ గేట్ నుంచి నాలుగు కిలోమీటర్ల మేర చౌదర్‌పల్లి గేట్ వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో కంచె, కందకాలు లేకపోవడంతో జింకలు రోడ్డుపైకి వస్తున్నాయి. సాగర్ రోడ్డుపై వాహనాల రాకపోకలు భారీగానే ఉంటాయి. నెల రోజుల వ్యవధిలో ఒక జింక ప్రమాదానికి గురై మృతి చెందగా, మరో నాలుగు ప్రాణాలతో బయటపడ్డాయి. నక్కలు, హైనాలు, కుందేళ్లు ఇలా పలు వన్యప్రాణులు మృతి చెందాయి. వేటగాళ్లు సైతం వన్యప్రాణులను చంపుతున్నట్లు తెలిసింది.

నీటి కుంటల ఏర్పాటు

గునుగల్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడం కోసం అటవీ శాఖ చర్యలు చేపట్టింది. రూ. 25 లక్షలతో పలు చోట్ల సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసి బోరుబావుల ద్వారా నీటి కుంటల్లో నీళ్లు నింపుతున్నారు. ఇప్పటి వరకు 15 నీటి కుంటలు ఏర్పాటు నీళ్లను నింపుతున్నారు. అదే విధంగా సాగర్ రోడ్డుపై గునుగల్ అటవీ ప్రాంతానికి ఇరువైపులా కందకాలు తీయించడం, బయో ఫెన్సింగ్ ఏర్పాటుకు అటవీ శాఖ నిర్ణయించింది. త్వరలో కందకాలు ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

పొలాల వద్దకు వస్తున్నాయి



గునుగల్ అటవీ ప్రాంత సమీపంలోనే మా పొలం ఉంది. జింకలు పొలం వద్దకు వస్తున్నాయి. సాగర్ రోడ్డుపై కారులో వెళ్లేటప్పుడు రోడ్డు పక్కనే కనిపిస్తుంటాయి. అటవీ శాఖ అధికారులు వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలి. జింకల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలి.

– శ్రీనువాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, గునుగల్

జింకల సంతతి పెరిగింది



గునుగల్ అటవీ ప్రాంతంలో జింకల సంతతి పెరిగింది. 2018 సర్వేలో 300 వరకు జింకలు ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం వీటి సంఖ్య వెయ్యికి పైగానే ఉంది. గునుగల్ అటవీ ప్రాంతం, సాగర్ రోడ్డుకు ఇరువైపులా కంచెలు, కందకాలు, బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి జింకలకు రక్షణ కల్పిస్తాం.

– విష్ణువర్ధన్‌రావు, ఫారెస్ట్ ఆఫీసర్, ఇబ్రహీంపట్నం

నేడు క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ శంకర్ రాథోడ్ మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 10గంటలకు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు ఎంపికలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి 8నుంచి 9 సంవత్సరాల మధ్య వయసు (1–9–14 నుంచి 31–8–15 మధ్య జన్మించి ఉండాలి) 5వ తరగతిలో ప్రవేశానికి 9నుంచి 10 సంవత్సరాల మధ్య వయస్సు (1–9–13నుంచి 31–8–14 మధ్య జన్మించి ఉండాలి) ఎంపిక ప్రక్రియకు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ప్రోగ్రెస్ కార్డు, పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. ఎత్తు, బరువు, 30మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాండ్ జంప్, 80 మీటర్ల పరుగు, 60 మీటర్ల సెటిల్ పరుగు, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

యాచారం: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి సంబంధించి ఈ నెల 6న యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక పోటీలు ఉంటాయని మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే 4, 5 తరగతుల విద్యార్థులు, 9, 10 ఏళ్ల మధ్య వయస్సు గల వారై ఉండాలని సూచించారు.

క్వీన్ విక్టోరియాకు ఘన సన్మానం



స్విమ్మర్ క్వీన్ విక్టోరియాను సత్కరిస్తున్న ఎంపీ రాములు

ఆమనగల్లు: అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి రెండు రజత పతకాలు సాధించిన స్విమ్మర్, ఆమనగల్లు పట్టణానికి చెందిన క్వీన్ విక్టోరియాను నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు పి.రాములు అభినందించారు. గత నెలలో ఈజిప్ట్ దేశ రాజధాని కైరోలో జరిగిన అంతర్జాతీయ అండర్ వాటర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశం తరఫున స్విమ్మర్ క్వీన్ విక్టోరియా పాల్గొని రెండు రజత పతకాలు సాధించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములును మంగళవారం క్రీడాకారిణి మర్యాదపూర్వకంగా కలిసింది. ఆమెను ఎంపీ రాములు ఘనంగా సత్కరించారు. క్వీన్ విక్టోరియా తెలంగాణకు గర్వకారణమని ఎంపీ అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఎంపీ ఆకాంక్షించారు.

ద్విచక్రవాహనం ఢీకొని విద్యార్థినికి తీవ్రగాయాలు



సీసీ కెమెరాలో రికార్డు అయిన ప్రమాద ఘటన

షాద్‌నగర్ రూరల్: స్కూల్ నుంచి ఇంటికి తోటి స్నేహితులతో కలసి నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థినిని బైక్ ఢీ కొట్టిన సంఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలోని మల్లికార్జున కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి జియా మంగళవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తోటి మిత్రులతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి బయలుదేరింది. వెనక నుంచి అతి వేగంగా వచ్చిన బైక్ బాలికను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జియాకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన యువకులు పారిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వీడియో సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ట్రాఫిక్ సీఐ శ్రీశైలం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ద్విచక్రవాహనం నడిపిన యువకుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలిక తండ్రి రుషిపాల్‌సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లుగీతకు ప్రభుత్వం చేయూత

కల్లుగీత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రవికుమార్‌గౌడ్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న రవికుమార్‌గౌడ్

కడ్తాల్: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కల్లుగీత వృత్తికి చేయూత నిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్‌గౌడ్ పేర్కొన్నారు. వృత్తిలో భాగంగా ప్రమాదాలకు గురయ్యే కార్మికుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన అన్నారు. మండలంలోని చరికొండ గ్రామంలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన కార్మికుడు నర్సింహగౌడ్ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ రూ.12 కోట్లతో నీరా కేఫ్ నెలకొల్పడం జరిగిందన్నారు. మద్యం దుకాణాల కేటాయింపుల్లో 15శాతం రిజర్వేషన్లు ఇచ్చారని తెలిపారు. ప్రమాదానికి గురై మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గీతన్న బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ రమణ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు చంద్రయ్యగౌడ్, నాయకులు జంగయ్యగౌడ్, పులిరాజుగౌడ్, సుధాకర్‌గౌడ్, అనిల్‌గౌడ్, నర్సింహగౌడ్, ఫామ్ ప్రొడక్ట్స్ రీసెర్చ్ అండర్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ అధినేత సత్యంగౌడ్, సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు విజ్ఞానాన్ని పంచుదాం

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి



గ్రంథాలయ కమిటీ సభ్యులకు పుస్తకాలు అందజేస్తున్న గంగిరెడ్డి

షాద్‌నగర్: గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేసి పాఠకులకు విజ్ఞానాన్ని పంచుదామని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గంగిరెడ్డి షాద్‌నగర్ గ్రేడ్–1 గ్రంథాలయానికి పదివేల విలువ చేసే పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శేఖర్, వైస్ చైర్మన్ మహేశ్వర్, డైరక్టర్లు సుధాకర్, జంగరాజ్, యాదయ్య, గోపాల్, అబ్దుల్ రావూఫ్, అజహర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి



షాద్‌నగర్ చేరుకున్న జీపుజాత సభ్యులకు స్వాగతం పలికిన నేతలు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

షాద్‌నగర్: కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. వేతన సవరణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత మంగళవారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ప్రతి పరిశ్రమలో నూటికి 90శాతం మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వీరు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీపు జాత ముగింపు సభ మేడ్చల్ జిల్లా చర్లపల్లి వద్ద నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమన్న, ఎస్ రాజు, చంద్రమోహన్, శ్రీనునాయక్, ఈశ్వర్ నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పూర్తయితే రాకపోకలు సులభతరం



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి: బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే మూసీకి ఇరువైపుల ఉన్న గ్రామాల ప్రజలకు రాకపోకలకు సులభతరం అవుతాయని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మోకిల – టంగటూరు గ్రామాల మధ్య మూసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి, రవాణా సౌకర్యం మెరుగు దలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టంగటూరు సర్పంచ్ గోపాల్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.